# తిరుమల ఆలయాలు





ధారావాహికం - 8

ఆంగ్లమూలం : డా రమేశన్
తెలుగు అనువాదం :
డా కోరాడ రామకృష్ణ, తిరుపతి

[చోళుల రాజ్యపతనం కాలంతో ఆరంభమైన నాయకత్వ శైథిల్యం విజయనగర సామ్రాజ్య స్థాపనవరకు నడిచింది. అయితే పరమతస్థుల దండయాత్ర త్రోవలో తిరుమల తిరుపతి ప్రాంతాలు రాక పోయినా ఇక్కడే ఉన్న సామంతులు సాహసపరులు తగినంత కల్లోల్లాన్ని కల్పించారు. అందువలన సామాజిక శాంతికి కొంతవరకు విఘాతం కలిగిన స్వామిసేవకు చెప్పుకోదగ్గ ఎటువంటి ఆటంకం కలుగలేదు. ఇక్కడ తిరుమల స్వామి అచరాకి దుర్గమమైనది కూడా ఒక కారణం అయి వుండ వచ్చునేమో! అయితే ఈ కష్టకాలంలోనూ యాదవ రాయలుల భక్తికి దాని అభివ్యక్తికీ ఎటువంటి ఆటంకము రాలేదు. తిరుమల తిరుపతులు విజయ నగర కాలంలో ఉన్నత స్థితి అందుకోవడానికి తగిన పునాదులు ఈ కాలంలోనే వేయబడ్డాయన్నది గమనార్హం.]

**(గత సంచిక తరువాయి)**

ప్రాచీన కాలమునుండీ వస్తున్న ఆచారం ప్రకారం రాజ్యానికి ఉత్తరాధికారియైన వారసునకు, రాజమాతకు మంజూరు చేయబడు ధనాన్ని సమకూర్చుకోడానికిగాను విధించబడు రెండు పన్నులగురించి ఆ శాసనాలు తెలుపుతున్నాయి. ఇవి కాక మరి యొక మూడవరకం పన్నుకూడా ఉంది. యుద్ధభూమిలో ఓడిపోయి శత్రువుచే బంధించబడినపుడు అట్టి తమరాజును విడిపించుకొనడానికి గాను కప్పంగా చెల్లించవలసిన మూల్యాన్ని సమకూర్చు కొనడానికై విధించబడే పన్ను.

క్రీ.శ. 1336 లేక 1337 వ సంవత్సరాన రాజ్యానికి వచ్చిన శ్రీరంగనాథ యాదవ రాయలు సుమారు 20 సంవత్సరాలు పాలించాడు. విజయనగర రాజ్యం స్థాపించబడినంతనే, శ్రీరంగనాథ యాదవరాయలు విజయనగర రాజ్య ఆధిపత్యానికి లోబడి వుండడానికి తన సమ్మతిని తెలిపి హరిహర I రాయలకు సామంతరాజుగా తన రాజ్యాన్ని పరిపాలించాడు. ఇతడు తన ఆజ్ఞను ధిక్కరించుటకు సాహసించిన రాజుల మీద దండయాత్రలుచేసి వారిని కొండకోనల్లో పారిపోయి తల దాచుకొనేట్లు చేసేవాడు. ఆనాడు దేశమంతా రాజకీయ అల్లకల్లోలంతో క్షుభితమై వుంది. అటువంటి సమయంలో శ్రీరంగనాథుడు విజయనగర రాజ్యానికి సహాయపడి తాను నమ్మకమైన బంటు నని నిరూపించుకొనే ఉద్దేశంతోనో లేక తన హోదాను పెంపు జేసు కొను ఉద్దేశంతోనో ఇటువంటి చురుకైన పాత్రను పోషించి వుంటాడు.

క్రీ.శ. 13 వ శతాబ్దం చివరి కాలంలో ప్రారంభమైన ఢిల్లీ సుల్తానుల దండయాత్రలు దక్షిణ భారత దేశంలోని నాలుగు ప్రముఖ రాజ్యాలను పునాదులంట కుదిపివేసింది. దేశం అంతటా అరాచకంతో అల్లకల్లోల పరిస్థితులతో నిండి ఉంది. ఈ క్షుభిత పరిస్థితులు క్రీ.శ. 14 వ శతాబ్దంలో బహమనీ, విజయనగర రాజ్యాలు స్థాపించి స్థిరపడడానికి దారితీసి, దేశం నందు అల్లకల్లోలం తగ్గి కొంత ప్రశాంతమైన వాతావరణం ఏర్పడ్డానికి దారితీసింది. కాని మహమ్మద్ I (క్రీ.శ. 1358-1375) పరిపాలనా కాలమునుండీ, బహమనీ రాజ్య విచ్ఛిత్తి జరిగిన కాలంవరకూ ఈ

రెండు రాజ్యాల మధ్య పరస్పర వినాశకరమైన భయంకర యుద్ధాలు అతితరచుగా జరుగుతూ వచ్చాయి. కృష్ణా, తుంగభద్రానదుల సంగమ ప్రదేశం వీరి రాజకీయ వివాదానికి లక్ష్యమైన వస్తువుగా మారి, పెనుగులాటకు దారి తీసింది. క్రీ.శ. 1538 సం నాటికి బహమనీ రాజ్యవంశ విచ్ఛిత్తి జరిగి లుప్తమై పోయినప్పటికీ, ఇంతకు చాలా పూర్వమే బహమనీ సుల్తాను తన రాజ్యం లోని రాష్ట్ర పాలకులపై పూర్తిగా పట్టును, ఆధిపత్యాన్ని కోల్పోయి నిర్వీర్యుడై పోయాడు.

## క్రీ.శ. 1260–1360 ప్రాంత అస్థిర రాజకీయ పరిస్థితుల పరివర్తన కాలంలో తిరుపతి

క్రీ.శ. 1336 వ సంవత్సరంలో విజయనగర సామ్రాజ్యానికి శంకుస్థాపన జరిగిన నాటి నుండీ తొండమండలం ఈ సామ్రాజ్యంలో ఒక భాగంగా చేరియుండేది. అయినప్పటికీని, తిరుమల తిరుపతి ప్రాంతానికి సంబంధించిన వివరాలు, విజయనగర లిఖిత పూర్వక ఆధారాల ప్రకారం క్రీ.శ. 1359 వ సంవత్సరమునుండి మాత్రమే లభ్యమవుతున్నాయి. సుందరపాండ్యుని కాలానికీ, ఈ మధ్య గడచిన కాలానికీ మధ్యకాలం రాజకీయంగా అస్థిరమై అతి వేగంగా పరివర్తన చెందుతూ గందరగోళంగా వున్న కాలం. ఈ కాలంలో చోళుల ఆధిపత్యానికి లోబడి ఉన్న సామంత రాజులు, పాళయగార్లు కేంద్రంలోని అధీశ్వరుని శక్తిహీనతను ఆసరాగా చేసుకొని, ఒక్కొక్కరుగా తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొంటూ వచ్చారు. వీరు ఎవరికీ తలొగ్గక పూర్తి స్వాతంత్ర్యం కలవారిగా ప్రవర్తించారు.

అట్టి ఈ సామంత ప్రముఖులలో కొప్పెరుంజింగ అన్న ఒకే పేరుగల తండ్రి, కొడుకు లిరువురు దేశంలో అలజడులు, కలతలు కలుగుటకు కారణమైరి. తండ్రి కొప్పెరుంజింగ కాడవరాయ అనుమరి యొక పేరుగల పెద్ద కొప్పెరుంజింగ శెందమంగళం, దాని చుట్టు ప్రక్కల ప్రాంతాలను పరిపాలించే ఒక పాళెయగాడు. ఇతడు అదనుచూసుకొని క్రీ.శ. 1220 వ సంవత్సరం ప్రాంతంలో తొండ మండలంమీద ఆకస్మిక దాడి చేసి కొంత భూగాన్ని ఆక్రమించి స్వాధీనం చేసికొన్నాడు. ఇతని కుమారుడైన కొప్పెరుంజింగ అనుమరియొక పేరుగల ఖడ్గమల్లు క్రీ.శ. 1243 వ సం లో తొండమండలంమీద దండెత్తి అక్కడి స్థానిక పాలకుడైన నరసింగ యాదవరాయనితో యురత్తూరులో యుద్ధంచేసి అతనిని ఓడించెను. విజయ గర్వంతో అక్కడినుండి ముందుకు ఉత్తరదిశగా సముద్రతీరం వెంబడి సాగి తూర్పుగోదావరి జిల్లాలోని ద్రాక్షారామంవద్ద కాకతీయరాజైన గణపతి దేవచక్రవర్తితో తలపడి చేసిన యుద్ధంలో చిత్తుగా ఓడిపోయి గర్వభంగం కాగా అవమానభారంతో ఇంటిముఖం పట్టాడు. అటు తరువాత సుందరపాండ్యుడు ఈ కొప్పెరుంజింగను తన పాదాక్రాంతుని గావించుకొన్నాడు. ఈ కొప్పెరుంజింగ యొక్క రెండు శాసనాలు తిరుమలలో లభించాయి (226, 227 టి.టి.)

చోళుల ఆధిపత్యానికి లోబడి సామంతరాజులుగా కొందరు పల్లవ ప్రముఖులు తొండమండలంలోని కొన్ని ప్రాంతాలకు పరిపాలకులుగా ఉన్నారు. ముఖ్యంగా ఆధునిక నెల్లూరు, కడప, కర్నూలు, చిత్తూరు, ఉత్తరార్కాడు, దక్షిణార్కాడు,చెంగల్పట్టు జిల్లాలు వీరి అధీనంలో వుండేవి. తమ సమకాలిక చోళరాజులు బలహీనులగుటను తెలిసికొనిన ఈ ప్రాంతీయ ప్రముఖులు తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకొన్నారు. కాని బలహీనులైన చోళులను తొలగించి పాండ్యుడు ఆధిపత్యాన్ని సంపాదించి ఈ రంగంలోనికి రాగా తాత్కాలికంగా అవసరార్థం ఈ పల్లవ ప్రముఖులు పాండ్యునకు దాసోహమన్నారు. ఈ ప్రాంతంలోని తిరుమల దేవాలయ శాసనాలలో ఇట్టి ప్రముఖులలో ముఖ్యంగా విజయగండ గోపాల, త్రిపురాంతక, మున్నగు ప్రముఖ పరిపాలకులు ప్రస్తావించుబడ్డారు (టి.టి. 173, 285, 143, 73, 431, 128, 296, 111, 137, 139, 141, 129, 125, 134, 652, 119, 123, 126, 443, 221, 72, జి.టి 127.)

నెల్లూరు అధికారపీఠంగా కలిగియున్న ఒక తెలుగు చోళ వంశానికి చెందిన ఒక కుటుంబం కూడా తొండమండలము మీద అధిక ప్రాబల్యాన్ని, పలుకుబడిని కలిగి యుండేది. ఈ కుటుంబానికి చెందిన అల్లున్ తిరుకాళత్తిదేవ కొంతకాలం కంచిపట్టణాన్ని తన ఆధీనంలో ఉంచుకొనగలిగాడు. తిరుమల శాసనాలలో ఈ రాజు ప్రస్థావన కనిపిస్తుంది.

తిరుమల తిరుపతి ప్రాంతంలో యాదవరాయరులు అత్యంత ప్రాముఖ్యంగల స్థానిక ప్రభువులు. వీరు ఈ ప్రాంతంలో ఉన్న దేవాలయాలతో సన్నిహిత సంబంధం కలిగి వుండేవారు. ఈ దేవాలయాలకు అనేక దాన ధర్మాలను చేసారు. వీరు నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు చెందిన వెంకటగిరి, కాళహస్తి, చంద్రగిరి తాలూకాలను పరిపాలించారు. క్రీ.శ. 1184–1227 సం లలో

చోళులకు సామంతుడుగా ఈ ప్రాంతాన్ని పరిపాలించిన ఘట్టదేవ అనే అతడు మనకు తెలిసినంతలో ఈ వంశానికి చెందిన వ్యక్తులలో మొదటివాడు. తిరుమలలో శైవులకు, వైష్ణవులకు మధ్య ఏర్పడిన తగాదాను పరిష్కరించడానికిగాను మధ్య వర్తిగా విచ్చేయవలసిందని రామానుజాచార్యులను ఇతడే ఆహ్వానించి నట్టు తెలుస్తోంది. కాని ఈ అభిప్రాయం సమర్థనీయం కాదు. ఎందు కంటే రామానుజాచార్యులు క్రీ.శ. 1184 సం తరువాత కొద్ది కాలంలోనే కీర్తిశేషుడయ్యాడు. కాగా ఘట్టి దేవుడు క్రీ.శ. 1184 సం నాటి వరకు రాజపాలకుడు కాలేదు. ఘట్టిదేవుని కుమారుడైన రాజమల్లు క్రీ.శ. 1208-1237 సం ప్రాంతంలో జీవించి రాజ్యపాలన చేశాడు. ఇతడే యాదవ నారాయణ అను దైవ విగ్రహాన్ని ప్రతిష్ఠించి పవిత్రీకరించా డని తెలుస్తోంది. అటు తరువాత వచ్చిన తిరుకాళత్తిదేవుని కాలం క్రీ.శ. 1191-1246 సం గా నిర్ణయించబడింది. ఇతడు తిరువణ్ణామలై నుండి కాళహస్తివరకు ఉన్న విశాల భూభాగానికి పరిపాలకుడుగా ఉన్నాడు. ఇతని కుమారుడైన వీరరాక్షస అను నతడు కులోత్తుంగ I పరిపాలనాకాలంలో రాజ్యపాలకుడుగా వర్ధిల్లాడు. తరువాత రాజ్యానికి వచ్చిన వీర నరసింగదేవ అనునతడు యాదవరాయల వంశంలో గొప్పవాడు. ఇతడు క్రీ.శ. 1209-1262 సం వరకు పరిపాలించాడు. మొదట ఇతడు చోళులకు సామంతరాజుగా ఉండి తరువాత పాండ్యుల అధికారానికి లోబడి తన రాజ్యాన్ని పరిపాలనచేశాడు. తిరుమల, తిరుపతుల దేవాలయాల అభివృద్ధి విషయమై ఎనలేని మేలు కలిగించిన గొప్పదాత. వీర నరసింగుని కుమారుడైనతిరువెంకటునాథక్రీ.శ. 1310-1336 సం కాలంలో పరిపాలకుడుగా ఉన్నాడు. ఈ కాలంలోనే తొండమండలానికి వెలుపల ప్రత్యేకంగా గమనించవలసి నంతటి అసాధారణ సంఘటనలు చోటుచేసుకున్నాయి. 12 వ శతాబ్దం చివరిదశలో ఉత్తర భారతదేశాన ఢిల్లీ సుల్తానులు అన్న పేరుతో ఒక చిన్న ముస్లింరాజ్యం స్థాపించబడింది. ఈ ముస్లిం పరిపాలకులు తమ రాజ్యాధికారాన్ని భారతదేశం నలుమూలల వ్యాపింప జేయడానికై తీవ్రంగా ప్రయత్నించారు. హిందూమతము మరియు కొన ఊపిరితో మరి అక్కడక్కడ తచ్చాడుతూ ఉండిన బౌద్ధమతం, నాటి మత సమాజాలు ముస్లిం మత పరిపాలకుల చేతిలో అగణితమైన ఇడుములను అనుభవించింది. 13 వ శతాబ్దం చివరిదశలో ఖిల్జీవంశం ఢిల్లీ సింహాసనంపై స్థిరంగా పాదుకొంది. ఈ కాలంలోనే దక్కన్ (దక్షిణ హిందూ దేశము) లో దేవగిరి (ఈనాటి దౌలతాబాద్) ముఖ్య పట్టణంగా యాదవరాజ్యం, యావత్ తెలుగు భాషా ప్రాంతానికి చెందిన సుప్రసిద్ధ కాకతీయ సామ్రాజ్యం అనే రెండు స్వతంత్ర రాజ్యాలు అభివృద్ధి పథంలో ఊపును అందుకొన్నవి. నైఋతి దిశలో మైసూరు రాష్ట్రంలోని ద్వారసముద్రం ముఖ్యపట్టణంగా హోయిసలుల రాజ్యం, మధుర ముఖ్యపట్టణంగా పాండ్యుల పరిపాలనలో తమిళదేశం శక్తివంతమైన దేశాలు వర్ధిల్లాయి. ఖార్ మరియు అహమ్మదాబాద్ ఖిల్జీ పరిపాలకుడైన అల్లాఉద్దీన్ క్రీ.శ. 1296 సం ప్రాంతాన అకారణంగా దేవగిరిపై దండెత్తి అశేష ధనసంపదను కొల్లగొట్టాడు. అటు తరువాత కొద్ది కాలంలోనే ఢిల్లీ సింహాసనాన్ని బలాత్కారంగా ఆక్రమించుకొని ఢిల్లీ సుల్తానయ్యాడు. ఇతడు మరల క్రీ.శ. 1303 సం లో ఆంధ్ర దేశంమీదకి పెద్ద సైన్యాన్ని దండయాత్ర చేయుటకు పంపాడు. కాని అది ఘోరపరాజయం పొంది వెనుదిరిగింది. అయినా మరల క్రీ.శ. 1309 సం లో పెద్ద సైన్యంతో, మాలిక్ - కాఫర్ వరంగల్ పట్టణాన్ని ముట్టడించి దాని పరిపాలకుడైన కాకతీయ ప్రతాపరుద్రుని నుండి అశేష ధనసంపదను బలవంతముగా కప్పంకింద ఊడబెరుక్కొని పోయాడు. అక్కడినుండి నైఋతు దిశగా పయనించి హోయలసల రాజ్యము మీదపడి, అడ్డు అదుపు లేకుండా దేశాన్ని కొల్లగొట్టి అనంతరం అక్కడినుండి తమిళ దేశాన్ని ప్రవేశించి, దోచుకొనగలిగినంత సంపదను దోచుకొని, పాండ్య రాజ్యాన్ని పునాదులంట కూల్చివేశాడు. ఈ విధంగా దక్కను, దక్షిణ హిందూ దేశంలోని హిందూరాజ్యాలమీద దండయాత్ర చేసి, ఆ రాజులనుండి అశేష ధనాన్ని కప్పంగా వసూలుచేసి, కొల్లగొట్టి, దోపిడీల మూలంగా మరింత ధనసంపదను, వజ్రవైడూర్యాది రత్నాలను బంగారాన్ని దోచుకొని మలికాఫర్ క్రీ.శ. 1310 లో ఢిల్లీకి తిరిగి వెళ్ళాడు. ఈ ముస్లింల దండయాత్రలో మలికాపూర్ వరంగల్ నుండి తిన్నగా దక్షిణదిశగా ఆంధ్ర దేశపు నడిబొడ్డు ప్రాంతం మీద పయనించడానికి బదులుగ నైఋతి దిశగా పోవడంవలన తిరుమల తిరుపతి ప్రాంతము ఈ ముస్లిం దోపిడీదారుల బారిన పడలేదు.

శ్రీరంగమునందలి శ్రీరంగనాథ దేవాలయమునకు సంబంధించిన కోయిల్ ఒళుగు (అనగా వంశపారంపర్యముగా వచ్చుచున్న జనశ్రుతి లేక ఐతిహ్యము) ప్రకారం సుమారుగా ఈ కాలంలోనే జరిగినట్లు తెలుస్తున్న ఒక ముఖ్యమైన సంఘటనను

గురించి వివరిస్తోంది. దీని ప్రకారం క్రీ.శ. 1327 సం లో తమిళదేశంమీద జరిపిన దండయాత్రలో మలికాఫర్ శ్రీరంగంమీదికి వస్తున్నాడు. ఈ విషయాన్ని వార్తాహరులు శ్రీరంగనాథ దేవాలయంలో గుమిగూడి యున్న భక్తజనులకు తెలియబరచారు. కాని ఆ సమయంలో వారు స్వామివారికి జరుపుచున్న ఉత్సవకార్యక్రమంలో నిమగ్నమై యున్నందువలన మొదట ఈ విషయం గురించి నిర్లక్ష్యం చేశారు. కాని ముస్లి సైన్యం దేవాలయం సమీపిస్తున్నారన్న విషయం నిజమేనని గ్రహించగానే త్వరపడిఅట్టి ఆకస్మిక పరిస్థితిలో తీసుకొనవలసిన తక్షణ చర్యలను అమలుపరచారు. మూలవిరాట్టు ఉన్న గర్భగృహానికి ఇటుకలతో గోడ కట్టి అమూల్య ఆభరణాదులు దాచారు. అత్యంత రహస్యంగా పిళ్ళైలోకాచార్యులు నమ్మకమైన భక్తుల సహకారంతో శ్రీరంగనాథుని ఉత్సవ విగ్రహాన్ని తీసుకొని పారిపోయి అడవిమార్గం పట్టాడు. శత్రువులకు తెలియకుండా అష్టకష్టాలకోర్చి అడవులను, కొండలను, కోనలను దాటి తిరుమలకు చేరుకొన్నాడు. అక్కడ బీటలను వారిన ఒక కొండ పగులు చీలికవద్ద మిక్కిలి ఇరుకు గాను, లోతుగాను ఉన్న ఒక రహస్య ప్రదేశంలో విగ్రహాన్ని భద్రంగా కొంతకాలం పరిస్థితులు చక్కబడునంతవరకు ఉంచి రక్షించినట్లు తెలుస్తోంది. కోయిల్ ఒళుగులో ఇవ్వబడిన తేదీ సరియైనది కాదనుట స్పష్టం. ఎందుకంటే మలిక్–కాఫర్ దండయాత్ర క్రీ.శ. 1309–1310 వ సం లో సంభవించినది. కాని క్రీ.శ. 1327 సం లో సంభవించలేదు. అంతేకాదు క్రీ.శ. 1327 లో తమిళదేశంపై ముస్లిందండయాత్ర జరిగి నట్లు దాఖలాలేదు. కాబట్టి ఈ దేవాలయచరిత్ర తెలుపుచున్న ముస్లిందండయాత్ర క్రీ.శ. 1310 వసం లో జరిగియుండాలి.

**(సశేషం)**

లోకంలో అన్నింటికన్నా గొప్పగుణం దయ. దయ, కరుణ కలిగిఉన్న మనసులో భగవంతుడు పీఠం వేసుకొని ఉంటాడు. సాటిజీవిపట్ల దయకలిగి ఉండటం మానవుని కనీస ధర్మం.

## తిరుమల యాత్రలో

# అన్నీ ఉచితం!

తిరుమల యాత్రకు వచ్చే సామాన్య భక్తులకు దాదాపు అన్ని సౌకర్యాలు ఉచితంగా లభిస్తాయి. భక్తులు కాస్త సహనంతో వ్యవహరించి ఈ సౌకర్యాలు ఉపయోగించు కోవచ్చు.

- ★ తిరుపతి బస్టాండు, రైల్వే స్టేషన్ల నుంచి అలిపిరికి (కాలినడక దారి వద్దకు) ఉచితంగా దేవస్థానం బస్సులు వున్నాయి.
- ★ అలిపిరి నుండి యాత్రికుల సామానులను తిరుమలకు ఉచితంగా చేరవేస్తారు.
- ★ తిరుమలలో బస చేసేందుకు ఉచిత సత్రాలు మరియు పిలిగ్రిమ్ అమెనిటీస్ కేంద్రాలు వున్నాయి.
- ★ కల్యాణకట్టలో ఉచితంగా తలనీలాలు సమర్పించవచ్చు.
- ★ స్నానానికి ఉచితంగా వేడి నీళ్లు లభిస్తాయి.
- ★ ఉచితంగా శ్రీవారి దర్శనానికి అనుమతిస్తారు.
- ★ దర్శనానంతరం శ్రీవారి ప్రసాదాలు ఉచితంగా ఇస్తారు.
- ★ శ్రీవారి నిత్యాన్నదానంలో ఉచితంగా భోజనం లభిస్తుంది.
- ★ తిరుమలలో వివిధ ప్రదేశాల మధ్య దేవస్థానంవారి ఉచిత బస్సులు నడుస్తున్నాయి.
- ★ లాకర్ల సౌకర్యం ఉచితంగా లభిస్తుంది.
- ★ ఉచితంగా పాదరక్షలు భద్రపరచుకోవచ్చు.